సాక్షి తిరుపతి

శుక్రవారం । 27 । జనవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,110
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,280

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,500
రిటైల్ వెండి గ్రాము	రూ.72.50

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	32	17
చిత్తూరు	31	16
తిరుమల	27	13
గూడూరు	32	19
నగరి	32	17

నేటి నుంచి వెటర్నరీ డాక్టర్ల శిక్షణ

తిరుచానూరు: ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ డెయిరీ టెక్నాలజీ కళాశాలలో శుక్ర, శనివారం రెండు రోజుల పాటు జిల్లాకు సంబంధించిన వెటర్నరీ డాక్టర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వర్సిటీ డీన్ డాక్టర్ ఎ.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి క్యూరేటర్ సెల్వం, ఏసీఎఫ్ నాగభూషణం, డాక్టర్ అరుణ్, కె.వీరబ్రహ్మయ్య, జిల్లా అనిమల్ హస్బెండరీ అధికారి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

రూ.120 కోట్లతో ఎస్వీ మ్యూజియం అభివృద్ధి



జెండా ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: దేశ విదేశాల నుంచి తిరుమలకు విచ్చేస్తోన్న భక్తులకు సౌకర్యవంతంగా శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామని ఇందుకు కృషి చేస్తోన్న అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలుపుతున్నామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి గృహం ఆవరణలో గురువారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవో ధర్మారెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి భద్రతా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రసంగిస్తూ శ్రీవారి మెట్టు మార్గంలో కాలినడకన వచ్చే భక్తుల కోసం త్వరలో ఎంబీసీతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో మినీ అన్నదానం కాంప్లెక్స్‌లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. టాటా సంస్థ విరాళంగా ఇచ్చిన రూ.120 కోట్లతో తిరుమలలోని ఎస్వీ మ్యూజియాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 4 వేల కళాఖండాలు ఉన్నాయని, వీటితోపాటు శ్రీవారి ఆభరణాల 3డీ ఇమేజీని ప్రదర్శిస్తామన్నారు. శ్రీవారి లడ్డూలను మరింత నాణ్యంగా, ఎక్కువ సంఖ్యలో తయారుచేసేందుకు వీలుగా రిలయన్స్ సంస్థ విరాళంగా అందించే రూ.50 కోట్లతో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టామన్నారు. దాత సహాయంతో రూ.23 కోట్లతో నిర్మించిన నూతన పరకామణి భవనాన్ని గతేడాది సెప్టెంబర్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారని, ఇతర అభివృద్ధి పనులు పూర్తిచేసి ఫిబ్రవరి మొదటి వారంలో కార్యకలాపాలు ప్రారంభిస్తామని వెల్లడించారు.

పెంచలకోన ఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న జనార్దన్‌రెడ్డి

రాపూరు : శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సహాయ కమిషనర్‌తో పాటు కార్య నిర్వహణాధికారిగా కే.జనార్దన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటసుబ్బయ్యను ప్రభుత్వం జొన్నవాడకు బదిలీ చేసింది.



గణతంత్ర వేడుకల్లో పోలీస్ పరేడ్

అభివృద్ధే ఎజెండా

- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- ప్రభుత్వ పథకాలు పేదల జీవితాలకు వరాలు
- 556 మందికి ప్రతిభా పురస్కారాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరైన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



జెండా వందనం చేస్తున్న కలెక్టర్, జేసీ, ఎస్పీ

తిరుపతి అర్బన్/ తిరుపతి మంగళం/ క్రైం/ కల్చరల్: అభివృద్ధే ఎ'జెండా'గా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం తిరుపతి పరేడ్ గ్రౌండ్‌లో 74వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జేసీ డీకే బాలాజీ, డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, ఆర్డీఓ కనకనరసారెడ్డి సారథ్యంలో జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. అనంతరం 556 మంది ఉద్యోగులకు ప్రతిభావార్డులను అందజేశారు. 17 స్టాల్స్‌ను, 8 శకటాలను అత్యంత రమణీయంగా తీర్చిదిద్దారు.

42 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో నవశకం ఆరంభం

కలెక్టర్ మాట్లాడుతూ 42 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో నవశకం ఆరంభమైందన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని ఆవిష్కరింపజేయాలనే సంకల్పంతో దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారని వెల్లడించారు. వ్యవసాయరంగంలో విత్తనం నుంచి ధాన్యం కొనుగోలు వరకు ప్రభుత్వమే బాధ్యతగా పనిచేస్తోందని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో 1.9 లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వచ్చినట్టు తెలిపారు. 445 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన అన్ని వ్యవసాయ పరికరాలు సరఫరా చేస్తున్నట్టు వివరించారు. రైతు భరోసా పథకం ద్వారా 1,74,680 మంది రైతులకు రూ.193 కోట్లు, వైఎస్సార్ సున్నావడ్డీ ద్వారా 14,822 మంది రైతులకు రూ.3కోట్ల మేర వడ్డీ రాయితీ ఇచ్చినట్టు వెల్లడించారు. వైఎస్సార్ ఉచిత పంటల భీమా పథకం ద్వారా 5,354 మంది రైతులకు రూ.3.69 కోట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. నవరత్నాల్లో భాగంగా జిల్లాలో పేదల సొంతింటికల సహకారం చేసేందుకు ప్రభుత్వం 73,723 ఇంటిపట్టాలు మంజూరు చేసిందన్నారు. అలాగే రూ.1,327 కోట్లతో 62,966 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని, ఉగాది నాటికి 24,677 గృహాలు ప్రారంభిస్తామని తెలిపారు. 446 వైఎస్సార్ విలేజ్‌హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేయడంలో జిల్లా ముందువరుసలో ఉందన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించడానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు తాగు, సాగునీటి పథకాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్టు వెల్లడించారు. ప్రముఖ ప్రాజెక్టులను పూర్తిచేసి జిల్లాలో 6.18 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్ పింఛన్, వైఎస్సార్ భీమా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, వైఎస్సార్ సున్నావడ్డీ తదితర పథకాలతో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. మనబడి నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేసినట్టు తెలిపారు. అంతేకాకుండా అమ్మఒడి ద్వారా 1,72,809 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి రూ.730 కోట్లు జమచేసినట్టు చెప్పారు.



మొదటి బహుమతి గెలుచుకున్న విద్యాశకటం



ఆకతాయిల ఆటకట్టిస్తున్న దిశ పోలీసులు



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యం

556 మందికి ఉత్తమ పురస్కారాలు

జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన వివిధ విభాగాలకు చెందిన 495 మంది ఉద్యోగులకు కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందించారు. ఇందులో జిల్లా అధికారులు 55 మంది, తహసీల్దార్లు 17, కలెక్టరేట్ ఉద్యోగులు, డివిజనల్ ఆఫీసర్లు 68, ఎంపీడీఓలు 14, పోలీస్‌శాఖలో 122, వ్యవసాయ శాఖలో 10, మున్సిపల్‌శాఖలో 10, పంచాయతీ రాజ్‌లో 17 మందితోపాటు పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు అవార్డులు అందుకున్నారు.

ఆకట్టుకున్న స్టాల్స్

పోలీసుశాఖ వారి దిశ, సైబర్ క్రైమ్, డీఆర్డీఏ ఉత్పత్తులు, మహిళాశిశు సంక్షేమశాఖ అమలు చేస్తున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, అక్షరాభ్యాసం, వ్యవసాయశాఖ చిరుధాన్యాల పంటలు, పట్టు పరిశ్రమ, హార్టికల్చర్, వైద్యఆరోగ్యశాఖ, జగనన్న గృహాలు, ఫిష్ ఆంధ్రా, విద్యాశాఖ, విభిన్న ప్రతిభావంతులు, ప్రకృతి వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, 1912 పశుఆరోగ్య సేవలు స్టాల్స్ సభికులను ఆకట్టుకున్నాయి. ఆర్డీఓ కనకనరసారెడ్డి, డీఈఓ వీ.శేఖర్, డీటీఓ సీతారామిరెడ్డి, డీపీటీఓ చెంగల్‌రెడ్డి, జిల్లా రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి పీవీఎస్ బాబు, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, ఐసీడీఎస్ జిల్లా అధికారిణి జయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి విజయకుమార్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ శంకరనారాయణ, పశుసంవర్ధకశాఖ, వ్యవసాయ, మత్స్య, ఉద్యానవన శాఖ ల జిల్లా అధికారులు రవికుమార్, ప్రసాద్‌రావు, చాంద్‌బాషా, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ శకటానికి ప్రథమ బహుమతి

గణతంత్ర వేడుకల్లో ప్రదర్శించిన 8 శకటాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రధానంగా నీటి యాజమాన్య సంస్థ, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, 104, 108, 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, డా.వైఎస్సార్ సంచారం పశుఆరోగ్య సేవ, మానబడి- నాడు నేడు, ప్రజాపంపిణీ, ధర్మ ప్రచార రథం, దిశా టు వీలర్, ఫోర్ వీలర్, మినీ బస్ వాహనాలు, అత్యంత సాంకేతిక వ్యవస్థ కలిగిన ఫాల్కన్ పోలీసు వాహనం శకటాలు ఆకట్టుకున్నాయి. వీటిలో విద్యాశాఖకు సంబంధించిన మనబడి నాడు-నేడు శకటానికి ప్రథమ బహుమతి దక్కింది. డీఈఓ శేఖర్‌ను పలువురు అభినందించారు.

డాగ్ షో



శునకాల గౌరవ వందనం

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ శునకాలు ప్రదర్శించిన విన్యాసాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. మొదటగా షైనీ డాగ్ పుష్పగుచ్ఛాన్ని జిల్లా కలెక్టర్‌కు అందించి స్వాగతం పలకడంతో విన్యాసాలు ఆరంభమయ్యాయి. అనంతరం షైనీ, గంగ, సోనీ, బిందు, లీల, హేమ శునకాలు పరేడ్‌లో అతిథికి గౌరవ వందనం చేసి అబ్బురపరిచాయి. డాగ్‌షో నిర్వాహకులు సీఐ వీరయ్యను కలెక్టర్, ఎస్పీ అభినందించారు. స్వాతంత్ర్య సమరయోధుడు స్థానిక కొంకాచెన్నాయ్‌కుంట వాసి లేట్ సుబ్రహ్మణ్యంరెడ్డి కుమారుడు యదేశ్వర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

వందే మాతరం



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనతంత్ర దినోత్సవంలో భాగంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థుల శాస్త్రీయ నృత్య రూపకం తెలుగు సంస్కృతికి అద్దం పట్టింది. ఓటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దన్ ధనాధన్ ధనారే జానపద గీతానికి అద్భుతంగా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. బాలభవన్ ఉపాధ్యాయిని సుభాషిణి, చంద్రగిరి బీసీ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థులు దేశభక్తి గీతంతో చేసిన పిరమిడ్ విన్యాసాలు నయనాందకరంగా సాగాయి. చంద్రగిరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన కోలాట నృత్యం అలరించింది.



ఉపాధిహామీ అధికారుల పరేడ్



నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు శకటం

తిరుపతి ఐఐటీలో

వంద అడుగుల జెండా ఆవిష్కరణ



ఐఐటీలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో డైరెక్టర్ కేఎన్. సత్యనారాయణ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. 100 అడుగుల జెండాను ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన సెక్యూరిటీ గార్డులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సీపీడబ్ల్యూచీఫ్ ఇంజినీర్, జేఎంసీ అధ్యక్షుడు డీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా..అభివృద్ధి చేస్తా

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): అందరికీ అందుబాటులో ఉంటూ మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన తొమ్మిది పంచాయతీల్లోని 52 గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని, తనను ఎప్పుడైనా ప్రజలు కలవచ్చన్నారు.ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో మంత్రి పర్యటన సందర్భంగా ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

జాతీయ పతాకం ఆవిష్కరణ

రిపబ్లిక్ డే సందర్భంగా మండలంలోని ఎర్రపాపిరెడ్డి గారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో మంత్రి జాతీయ జెండా ఎగురవేసి గౌరవవందనం సమర్పించారు. చిన్నారులతో ముచ్చరించారు. స్కూలు ఆవరణలో మొక్కలు నాటారు.



జెండా వందనం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

మంత్రి సమక్షంలో పార్టీలో చేరిక

దిగువ పోకలవారిపల్లె పంచాయతీ యల్లంపల్లెకు చెందిన దాదాపు 20 మంది టీడీపీ నాయకులు మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. చేరిన వారిలో మదన్‌మోహన్‌గౌడ్, బాలు, లోకేష్, దినేష్, కరుణాకర్ మరి కొందరు ఉన్నారు. వారికి పార్టీ కండువాలు కప్పి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ పలువురు నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన యల్లంపల్లె టీడీపీ నాయకులు

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

తిరుపతి మంగళం: ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డితో కలిసి ఆమె తిరుపతిలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పట్టభద్రులు ఉపాధ్యాయుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి

- జంతుప్రదర్శనశాలలో జాతీయ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి అలిపిరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వందన సమర్పణ చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం జూపార్క్‌లో పనిచేసే సిబ్బందిని ఆత్మీయంగా పలకరించి బాగోగులు తెలుసుకున్నారు. అంతకు ముందు తిరుపతి కపిలతీర్థం సమీపంలోని వీర జవానుల స్థూపానికి మాజీ సైనికులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ సెల్వం, ఏసీఎఫ్ నాగభూషణం, మాజీ సైనికులు, జూ పార్క్ సిబ్బంది పాల్గొన్నారు.



అంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



ఎస్వీ జూపార్క్‌లో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

'ఘన'తంత్ర వేడుకలు

తిరుపతి అర్బన్: జిల్లాలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, కుటుంబసభ్యులు విద్యార్థులతో కలిసి గణతంత్ర వేడుకలు నిర్వహించారు. తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కనకనరసారెడ్డి జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. అలాగే జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్ పీవీఎస్ బాబుతోపాటు సబ్ రిజిస్ట్రార్ శివకుమారి పాల్గొన్నారు. ఆర్టీసీ జిల్లా కార్యాలయంలో డీపీటీవో చెంగల్‌రెడ్డి నేతృత్వంలో జెండాను ఎగురవేశారు. అన్నమయ్య సర్కిల్ సమీపంలోని గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నైనార్ మధుబాల జాతీయ జెండాను ఎగురవేశారు. ఆమెతోపాటు కార్యదర్శి శివ ప్రసాద్ పాల్గొన్నారు.


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న డీఆర్వో ఎం. శ్రీనివాసరావు


కనకనరసారెడ్డి, ఆర్డీవో | వి.శేఖర్, డీఈవో | జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ | శ్రీనివాస ప్రసాద్, డ్వామా పీడీ | ప్రసాద్‌రావు, వ్యవసాయశాఖ | జయరాజ్, జిల్లా సర్వే అధికారి | దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ | సుభాష్-లీడ్ బ్యాంక్ మేనేజర్


ఉమాదేవి, ప్రాథమిక సహకార సంఘం | సతీష్, మైక్రో ఇరిగేషన్ | డాక్టర్ శ్రీహరి, డీఎంహెచ్‌వో | ధనంజయరెడ్డి, ఆరోగ్యశాఖ | రాజశేఖర్‌రెడ్డి- డీపీవో | చెన్నయ్య, ఎస్సీ వెల్ఫేర్ | జయలక్ష్మి, శిశు సంక్షేమం | మురళీకృష్ణారెడ్డి, సెట్విన్ సీఈవో


శంకర్ నారాయణ, పంచాయతీరాజ్ | విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ | సుధాకర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ | కృష్ణారెడ్డి, ఎస్పీ డీసీఎల్ | సీతారామిరెడ్డి, రవాణశాఖ | చెంగల్‌రెడ్డి, డీపీటీఓ | ప్రతాప్‌రెడ్డి, పరిశ్రమలశాఖ | లక్ష్మీకర్‌రెడ్డి, ట్రెజరీ


స్వాతి, ఎస్‌ఈబీ ఎస్పీ | పీవీఎస్ బాబు, జిల్లా రిజిస్ట్రార్ | రమణప్రసాద్, టూరిజం | బాలకొండయ్య, సమాచారశాఖ | రుపేంద్రనాథ్ రెడ్డి, టూరిజం | లక్ష్మి, తుడా సెక్రటరీ | సుశీలాదేవి, డీఎల్‌డీఓ | ఎంపీ ప్రసాద్, సివిల్ సప్లయిస్ | సతీష్‌రెడ్డి- అటవీశాఖ | కిరణ్‌కుమార్, ఆర్డీవో | జరీనా బేగం తహసీల్దార్ | మునిరత్నం రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ | రాజ, రుయా మెడికల్ అసోసియేషన్


కాటమరాజు, గృహ నిర్మాణ శాఖ | రమేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ | సరళ, వ్యవసాయశాఖ | సురేంద్రరెడ్డి, వ్యవసాయశాఖ | ధనంజయరెడ్డి, వ్యవసాయశాఖ | పుణ్యకోటి, విద్యుత్‌శాఖ | మాధవి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి | డాక్టర్ సురేష్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి | రాజారత్నం,మహిళా శిశు సంక్షేమ ఉద్యోగి | రాజశేఖర్‌రెడ్డి-ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ | విజయసింహారెడ్డి డీపీఆర్‌వో


కలెక్టర్‌కు మెమెంటో అందజేస్తున్న రెవెన్యూ అధికారులు


సుబ్రమణ్యంరెడ్డి కుటుంబసభ్యులకు మెమెంటో అందజేస్తున్న కలెక్టర్


పార్థసారథికి ఇండియన్ పోలీసు మెడల్


నంద కిషోర్ - ఏఆర్ డీఎస్పీ


షానుషేక్, రైల్వే డీఎస్పీ | రామరాజు -డీఎస్పీ | సురేంద్రరెడ్డి- సీఐ | శివప్రసాద్‌రెడ్డి- సీఐ | చంద్రశేఖర్-సీఐ | సుబ్రమణ్యం రెడ్డి- సీఐ


భాస్కర్‌రెడ్డి- ట్రాఫిక్ సీఐ | శివకుమార్‌రెడ్డి- సీఐ | రెడ్డెప్పరెడ్డి -ఆర్ఐ | విక్రమ్- క్రైమ్‌సీఐ | సుధాకర్ - ఎస్ఐ | వెంకటచిన్న - ఎస్ఐ | చంద్ర, పోలీసు పీఆర్వో

భారీగా ఎర్రచందనం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలతో అటవీ అధికారులు, సిబ్బంది

భాకరాపేట : శేషాచల అటవీ ప్రాంతంలోని తలకోన సౌత్ బీట్ పరిధిలో భారీగా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్టు ఫారెస్ట్ రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. భాకరాపేట ఫారెస్ట్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎర్రచందనం దుంగలు అక్రమరవాణాకు సిద్ధం చేస్తున్నారన్న సమాచారంతో బుధవారం అర్ధరాత్రి ఎర్రావారిపాళెం మండలం, చింతగుంట పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో కాపు కాసినట్టు తెలిపారు. పసుపులేటివారిపల్లె సమీపంలోని అటవీ సరిహద్దులో లోడింగ్ పాయింట్ వద్దకు స్మగ్లర్లు కూలీల సాయంతో ఎర్రచందనం దుంగలు తీసుకొస్తుండగా గుర్తించి వారిని పట్టుకునే ప్రయత్నం చేసినట్టు చెప్పారు. దుంగలు పడేసి దొంగలు అడవిలోకి జారుకున్నట్టు వెల్లడించారు. ఆ ప్రాంతంలో 621 కిలోల బరువుగల 20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వీటి ధర రూ.50 లక్షలపైనే ఉంటుందన్నారు. దాడుల్లో ఎఫ్ఎస్‌ఓలు సల్లావుద్దీన్, ప్రదీప్‌కుమార్, ఎఫ్‌బీఓలు నిఖిల్, రాజేష్, ప్రదీప్‌చంద్, సురేష్, రవి, లోకనాథం, బేష్ క్యాంపు సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

వకుళామాత ఆలయంలో చోరుల అరెస్ట్

రూ.20వేల నగదు, ఆటో స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపిస్తున్న ఏఎస్పీ విమలకుమారి

తిరుపతి క్రైం: వకుళామాత ఆలయంలో చోరీ కేసును తిరుపతి క్రైమ్ పోలీసులు ఛేదించినట్లు జిల్లా క్రైమ్ ఏఎస్పీ విమలకుమారి తెలిపారు. ఇటీవల జరిగిన ఆలయం చోరీ కేసులో సత్యసాయిజిల్లా, మమ్మాయిలకుండలకు చెందిన నగిరి గిరిగంగరాజు అలియాస్ రాజు(27), అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన జిరిపిటి రెడ్డెప్ప(28), అదే గ్రామానికి చెందిన పొట్టి బాబు నరసింహులు(33), అద్దెలపల్లి కిరణ్(25) ఒక ముఠాకు చెందినవారు. వీరంతా కాలూరు క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. ఈ విచారణలో వీరు గతంలో రేణిగుంట గంగమ్మ ఆలయంలోనూ దొంగతనం చేసినట్లుగా తెలిసింది. తిరుచానూరు పరిధిలో కూడా రాత్రి సమయంలో ఆలయాల్లో చోరీ చేసినట్లుగా గుర్తించారు. వీరి వద్ద నుంచి ఒక ఆటోతో పాటు 20 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి కోర్టుకు తరలించారు.

రైతులకు మరింత అండ

- ఏడాదిలో 67,729 వ్యవసాయ కనెక్షన్లు
- వినియోగదారుల సేవలకోసం రోబో కాల్ టెక్నాలజీ
- గణతంత్ర దినోత్సవ సంబరాల్లో డైరెక్టర్ సుబ్బరాజు వెల్లడి


ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న డైరెక్టర్ సుబ్బరాజు

తిరుపతి రూరల్: వ్యవసాయాన్ని పండగ చేసేలా ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) రైతులకు మరింతగా అండగా ఉంటుందని ఆ సంస్థ టెక్నికల్ డైరెక్టర్ ఎన్వీఎస్ సుబ్బరాజు తెలిపారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేసిన ఆయన మాట్లాడుతూ ఎంతోమంది అమర వీరుల త్యాగాల ఫలితంగానే మనం గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోగలుగుతున్నామని అన్నారు. గత ఏడాది సంస్థ పరిధిలో 67,729 వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేశామని, రైతులకు పగటిపూట 9 గంటల నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నామన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన, సత్వర సేవలను అందించేందుకు వీలుగా ఏపీఎస్ పీడీసీఎల్ కాల్ సెంటర్లో రోబో టెక్నాలజీని వినియోగిస్తున్నామని తెలిపారు. వినియోగదారులకు సంస్థ ఉద్యోగులు సమిష్టి కృషితో అందించిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా గత యేడాది సంస్థ జాతీయ స్థాయి అవార్డులను అందుకోవడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల విద్యుదీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన సర్కిల్స్, డివిజన్లు, అధికారులకు ఆయన ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు సురేష్, లక్ష్మినరసయ్య, ధర్మజ్ఞాని, చలపతి, గురవయ్య, వరకుమార్, జాయింట్ సెక్రటరీ రాధాజయశ్రీ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ లావణ్య లక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విమానాశ్రయంలో గణతంత్ర దినోత్సవం


తిరుపతి విమానాశ్రయంలో జెండా వందనం

రేణిగుంట: తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం గణతంత్ర దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ రాజ్‌కిషోర్ నేతృత్వంలో నూతన టెర్మినల్ ప్రాంగణం ముందున్న 100 అడుగుల మువ్వన్నెల జెండాను ఎగురవేసి జెండా వందనం చేశారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రత్యేక కవాతు నిర్వహించారు. భారత స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. బుధవారం నుంచే టెర్మినల్ మొత్తం మూడురంగుల జెండాను పోలిన రీతిలో విద్యుత్ కాంతులతో ప్రదర్శించడంతో వీక్షకులను, విమానయాన ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే టెర్మినల్ లోపల త్రివర్ణ పతాకాన్ని రంగవల్లుల రూపంలో వేశారు.

దూరమైన అయినవాళ్లు.. ఆగని కన్నీళ్లు

'చేతికొచ్చిన బిడ్డలు జీవిత చరమాంకంలో అండగా ఉంటారనుకున్నాం. కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తారని ఆశలు పెట్టుకున్నాం. తోడబుట్టిన వాళ్లకు చేదోడువాదోడుగా నిలుస్తారని భావించాం. మమ్మలందర్నీ వదిలి అప్పుడే వెళ్లిపోయారా.. నాయనా..!' అంటూ రోడ్డు ప్రమాద బాధితుల బంధువులు బోరున విలపించారు. రుయా మార్చురీ వద్ద విగత జీవులుగా పడి ఉన్న బిడ్డల మృతదేహాలు చూసి తల్లడిల్లిపోయారు. మృతదేహాలపై పడి గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఐదు మృతదేహాలు మహారాష్ట్రకు తరలింపు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు రెఫర్
- మిన్నంటిన బంధువుల రోదనలు


మృతదేహం వద్ద బంధువులు, పోలీసులు

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక యాత్ర ఆ కుటుంబాల్లో తీవ్ర శోకాన్ని మిగిల్చింది. వారిపైనే ఆశలు పెట్టుకుని జీవిస్తున్న తల్లిదండ్రులను పుట్టెడు దుఃఖంలోకి నెట్టింది. యాత్రలో భాగంగా మహారాష్ట్రకు చెందిన 9 మంది యువకులు తిరుపతి నుంచి కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి వెళుతూ బుధవారం ప్రమాదానికి గురైన విషయం తెల్సిందే. చంద్రగిరి మండలంలోని జాతీయ రహదారి కల్‌రోడ్డుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయాలపాలయ్యారు. మృతుల కుటుంబ సభ్యులు గురువారం తిరుపతికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

మిన్నంటిన రోదనలు

రుయా మార్చురీ వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాలను చూసి బోరున విలపించారు. దేవుడి దర్శనానికి వచ్చి దూరమయ్యావా బిడ్డా అంటూ అజయ్‌నంగ్‌నాథ్, రుషికేశ్ జంగంతండ్రులు గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. నీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా.. ఇంతలో దూరమయ్యావా నాయనా.. అంటూ అంబదాస్ కుమార్ తండ్రి కన్నీళ్లు పెట్టుకున్నారు.

తల్లడిల్లుతున్న క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన క్షతగాత్రుల రోదన వర్ణనాతీతం. తీవ్ర గాయాలు కావడంతో భరించలేని స్థితిలో వారు తల్లడిల్లుతున్నారు. బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రుల్లో ఒకరికి న్యూరో సర్జరీ అవసరమని, మిగిలిన వారికి తీవ్ర గాయాలు కావడంతో వైద్యాన్ని అందిస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు.

మృతదేహాల తరలింపు

మృతదేహాలను అంబులెన్స్‌ల ద్వారా మహారాష్ట్ర షోలాపూర్‌కు తరలించారు. బంధువులు రావడంతో పోలీసుల సమక్షంలో వైద్యులు పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. చంద్రగిరి సీఐ ఓబులేశు చొరవ తీసుకుని ప్రైవేట్ అంబులెన్స్‌ను మాట్లాడి మహారాష్ట్రకు మృతదేహాలను తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఆయన చొరవతోనే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం ఉన్నతాధికారులతో మాట్లాడి స్విమ్స్‌కు తరలించారు.

బాధితులకు భరోసా

- రూ.10.50 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి


బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు రూ.10.50 లక్షల చెక్కులను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. తిరుపతి రజకుల కాలనీకి చెందిన శేఖర్‌బాబుకు రూ.50 వేలు, విప్పమానుపట్టెడకు చెందిన తండ్లం బాలిరెడ్డికి రూ.10 లక్షల చెక్కులు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి. ఆ చెక్కులను ఎమ్మెల్యే చెవిరెడ్డి చేతులు మీదుగా బాధితులకు అందించారు. అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో బాధపడే తమకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు రావడం ఆనందంగా ఉందని బాధిత కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

బ్యాంక్‌కు వినియోగదారుల కమిషన్ వడ్డన

తిరుపతి లీగల్ : సేవా లోపానికి పాల్పడినందుకు ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇదివరలో ఆంధ్రా బ్యాంక్ ఫిర్యాదుదారులకు పరిహారం చెల్లించాలని తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు చెప్పింది. వివరాల్లోకి వెళితే.. తిరుపతి రూరల్ వేమూరుకు చెందిన గెరటప్ప నాయుడు తన పేరున ఉన్న వ్యవసాయ భూమికి సంబంధించిన విక్రయపత్రాన్ని బ్యాంకులో ఉంచి రెండు వేర్వేరుగా ఇంటి రుణాలను 2004లో తీసుకున్నారు. 2010లో ఆ వ్యవసాయ భూమిని తన కుమారులకు భాగపరిష్కారం చేసి భాగ పరిష్కార పత్రాన్ని రాసి ఇచ్చాడు. గెరటప్పనాయుడు 2018 ఫిబ్రవరి 23న మరణించాడు. ఆయన కుమారులు ఎన్.గోపాల్‌నాయుడు, తిరుపతి నిమ్మకాయల వీధికి చెందిన న్యాయవాది ఎన్.భూపాల్‌నాయుడు తన తండ్రి తీసుకున్న రుణాన్ని బ్యాంకుకు చెల్లించి తన తండ్రి ఇదివరలో ఉంచిన విక్రయ పత్రాన్ని తిరిగి ఇవ్వాలని బ్యాంకు అధికారులను కోరారు. దీనిపై బ్యాంకు అధికారులు స్పందించలేదు. దీంతో ఇద్దరు కలసి తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో తిరుపతి బేరివీధి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్, ఎస్వీయూ క్యాంపస్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్లను ప్రతివాదులుగా పేర్కొంటూ ఫిర్యాదు దాఖలుచేశారు. ఇరువైపుల వాదనలు పరిశీలించిన తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు ఎ.పార్థసారధి, సభ్యులు ఎస్.శశిధర్‌రెడ్డి, టి.స్నేహత ఫిర్యాదుదారుల తండ్రి ఇదివరలో బ్యాంకులో ఇచ్చిన విక్రయ పత్రాన్ని 45 రోజుల్లో ఫిర్యాదుదారులకు తిరిగి ఇవ్వాలని బ్యాంకు సిబ్బందిని ఆదేశిస్తూ తీర్పు చెప్పారు. అలాగే నష్టపరిహారం, సేవా లోపం కింద రూ.1.5 లక్షలను, ఫిర్యాదు ఖర్చులు కింద రూ.5వేలను ఫిర్యాదుదారులకు చెల్లించాలని తీర్పు చెప్పారు. అలా చెల్లించని ఎడల నష్ట పరిహారం సొమ్ముకు 9 శాతం వడ్డీ లెక్కన బ్యాంకు అధికారులు చెల్లించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అలాగే వారి తండ్రి పాస్ బుక్‌ను బ్యాంకులో ఇచ్చి వుంటే ఫిర్యాదుదారుల తల్లి, ఇతర సోదరుల వద్ద బాండు తీసుకుని తిరిగి ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు.